కుంటుపడుతున్న అభివృద్ధి..!

- గ్రామాలకు నిధుల కటకట
- తొమ్మిది నెలలుగా నిలిచిన నిధులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్యదర్శులు



గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: ఈఏడాది ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి జీపీలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే గ్రామ పంచాయతీలలో మౌలిక వసతులు కల్పన కోసం, వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలో ఉన్న జనాభా ప్రతిపాదికన ఆరు నెలలకు ఒకసారి నిధులు మంజూరు చేస్తోంది. అయితే గత ఫిబ్రవరి నుంచి కేంద్రం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు వాపోతున్నారు.

మండలంలో 34 జీపీలు..

మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. 58 గ్రామాలున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆయా గ్రామ పంచాయతీలలో సుమారు 36,312 జనాభా ఉన్నారు. అయితే ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 850 అందజేస్తోంది. ఈ లెక్కాన చూసుకుంటే ఏడాదికి మండలానికి రూ. 3,08,65,200 వస్తాయి. కానీ నిధులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు ఎందుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

క్రెడిట్ ఇవ్వడానికి నిరాకరణ..

గ్రామ పంచాయతీలకు కావాల్సిన బల్బులు, బ్లీచింగ్ పౌడర్, తదితర వాటిని సంబంధిత ఏజన్సీలు గ్రామ పంచాయతీలకు క్రెడిట్ ఇస్తారు. ఆ ఏజన్సీలకు బిల్లులు సకాలంలో అందకపోవడంతో వారు వివిధ వస్తువులు క్రెడిట్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు మాత్రమే..

రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్‌లకు సంబంధించిన వేతనాలకు సంబంధించిన నిధులు మాత్రమే అందజేస్తుందని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలకు వివిధ పన్నుల రూపంలో వచ్చినా నిధులు జీపీలలో అందుబాటులో ఉన్నప్పటికీ ఫ్రీజింగ్ ఉండడంతో చెక్కులు సకాలంలో పాస్ కావడం లేదని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీపీలకు సంబంధించిన బిల్లులు సకాలంలో పాస్ అయ్యేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

క్లుప్తంగా

భక్తిభావన కలిగి ఉండాలి



పూజలు చేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ భక్తిభావన కలిగి ఉండాలని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని బుద్దికొండ గ్రామ శివారులోని శబరిమాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శివానంద మహర్షి గీతా జయంతిని పురస్కరించుకొని ఇటీవల శబరిమాత ఆలయ కమిటీ సభ్యులు హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు చేయాలని కోరగా.. స్పందించిన ఆడే గజేందర్ హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బ్లాక్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డి, బద్ధం పోతారెడ్డి, షేక్ మౌలానా, మోహన్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 14, 15న నిర్వహించే పదో మహాసభల కరపత్రాలను ఆ సంఘం నాయకులు బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోన్‌కాంబ్లే గోపినాథ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురంలో ఈనెల 14న సంస్థాగత కార్యక్రమం ఉంటుందని, ఈనెల 15న సదస్సు ఉంటుందన్నారు. మహాసభలకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక సభ్యులు అతిష్ కాంబ్లే, ఆరీఫ్, నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దుప్పట్లు పంపిణీ

నార్నూర్: మండలంలోని ఖైర్‌డట్వా గ్రామంలో నేడు గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ చేతుల మీదుగా దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని సీఐ రహీంపాషా బుధవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఏపీపీ నవీన్

బోథ్: బోథ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ బదిలీ కావడంతో ఆయనను బోథ్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, సిరిపురం చంద్రమోహన్, కటకం నగేశ్, ఆడెపు కిరణ్, సురేశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుళ్లు రవీందర్ సింగ్, ఆశన్న, నాగనాథ్, నారాయణలను బుధవారం ఏపీపీ నవీన్ సన్మానించారు. పూలమాల, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న సిబ్బంది కోర్టు డ్యూటీ అధికారులుగా తమ పాత్రను వందశాతం నెరవేర్చారని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని కొనియాడారు.

ఎదులాపురం: చీఫ్ ఇంజనీరుగా పదోన్నతి పొందిన చవాన్ జైవంత్ రావును బుధవారం లంబాడా జేఏసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. లంబాడా జేఏసీ నాయకులు గోపాల్ రావ్, నేతావత్ రాందాస్, రాథోడ్ బాబులల్ ఉపాధ్యక్షులు, బానోత్ జగన్ నాయక్, రాథోడ్ పరశురామ్, రాథోడ్ సుధాకర్ నాయక్, మహేందర్ రాథోడ్ పాల్గొన్నారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద గల శ్రీ సాయిబాబా జిన్నింగ్ ఫ్యాక్టరీ, నేరడిగొండ మండలంలోని శ్రీ దర్శన ఇండస్ట్రీస్ సీసీఐ కేంద్రాల్లో పత్తి నిల్వలు అధికంగా ఉండడం వల్ల గురువారం నుంచి ఈనెల 15 వరకు తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. 16న తిరిగి కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

60 వాహనాల పత్తి మాత్రమే కొనుగోలు..

బోథ్ మండల కేంద్రంలోని స్వప్న జిన్నింగ్ ఫ్యాక్టరీ, రాఘవేంద్ర జిన్నింగ్ ఫ్యాక్టరీ, సాయిదత్త ఫ్యాక్టరీలలోని సీసీఐ కేంద్రాలలో పత్తి నిలవ్వలు అధికంగా ఉండటంతో రోజుకు 60 వాహనాల పత్తిని మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు.

‘ఆరు గ్యారంటీల అమలులో విఫలం’



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ: ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో పూర్తిగా విఫమైందని ముఖరా (కె) గ్రామస్తులు ఆరోపించారు. బుధవారం పంట పొలంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లు మాట్లాడారు. రైతు భోరోసా, రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేయకుండా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణ పాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో పరిపాలన గాడి తప్పిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్, దత్త, పరమేశ్వర్, బాలాజీ, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: కొలాం సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించే ఐటీడీఏ ముట్టడి, మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొలాం సంఘం మండల అధ్యక్షుడు కొడప భీంరావ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్నెవార్లు, అసలైన కొలాం గిరిజనులకు ఎటువంటి సంబంధం లేదని, మన్నెవార్ సంస్కృతికి.. కొలాం గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు తేడా ఉందన్నారు. మన్నెవార్లు అక్రమంగా కొలవార్‌గా కుల ధ్రువీకరణ పత్రాలు పొంది ఎస్టీలుగా చెలామని అవుతున్నారని ఆరోపించారు. గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొలాం సంఘం మండల నాయకులు కొడప లక్ష్మణ్, కుంర భీంరావ్, తుకారం, విజయ్, మానిక్‌రావ్, రాజేశ్వర్, శ్యాంరావ్, దేవ్‌రావ్, జంగు, భీంరావ్ పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి



వివేకానంద పాఠశాలలో గీతా జయంతి వేడుకలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో బుధవారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సంతోష్‌కుమార్ విద్యార్థులకు గీతా జయంతి విశిష్ఠతను వివరించారు. గీతాలో శ్రీకృష్ణుడు ఇచ్చిన ఉపదేశంలో అర్జునుడు కురుక్షేత్రంలో కౌరవులతో చేసిన యుద్ధంలో గెలుపొందారని విద్యార్థులకు తెలియజేశారు. ప్రతిఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఆచార్యులు ఉషారాణి, భారతి, గాయత్రి, సౌందర్య, సోనాబాయి, కావ్య పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్, సొనాలలోని వివేకానంద పాఠశాలలో బుధవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. భగవద్గీత ప్రతీ సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు. బోథ్‌లో ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర గౌడ్, సొనాలలో ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో రోగులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పేర్కొన్నారు. బుధవారం రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూరోకు సంబంధించి న్యూరాలజిస్ట్ వైద్యుడు విజయ్‌మోహన్ రెండు ఆపరేషన్లు చేయగా రోగులు ప్రస్తుతం కోలుకున్నారన్నారు. పట్టణానికి చెందిన సతీష్ నడుము నొప్పి, కాళ్లకు తిమ్మిర్లతో రిమ్స్‌లో చేరగా ఆపరేషన్ చేశారన్నారు. తలమడుగు మండలం పల్సి(కె) గ్రామానికి చెందిన లక్ష్మి తలకు గాయమై కోమాలోకి వెళ్లగా ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. సమావేశంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి ఆమోదం



సమావేశమైన మార్కెట్ కమిటీ పాలకవర్గం

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గం చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అధ్యక్షతన సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నూతనంగా గోదాం నిర్మాణాన్ని చేపట్టాలని తీర్మానించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఆడె వసంత్ రావ్, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ముస్తాబైన ఆలయం

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) తండా (దాసునాయక్‌తండా)లోని శ్రీజగదాంబదేవి సహిత సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపనకు ముస్తాబైంది. ఈనెల 12 నుంచి 14 వరకు నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. 12న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణం, జలాధివాసం, నిత్యహోమం, 13న ధాన్యాదివాసం, క్షీరాధివాసం, పంచశయ్యాధివాసము, నిత్యహోమం, 14న జగదాంబదేవి సహిత సంత్‌సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతితోపాటు మహాఅన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


జీవన్‌రావ్ వర్ధంతి

లోకేశ్వరం: మండలకేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ దివంగత జీవన్‌రావు పదో వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఆయన అభిమానులు ముందుగా జీవన్‌రావు విగ్రహానికి నివాళులర్పించారు. జీవన్‌రావు సోదరుడు నాగారావు, సాయన్న, కృష్ణ, గజ్జారాం, గంగారాం, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఖానాపూర్: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత ప్రతిభ పాటవ పోటీల్లో మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంగ్లిష్ మీడియం విభాగంలో రోహిత్ (పదోతరగతి) ప్రథమస్థానంలో, హర్షవర్ధన్ (పదోతరగతి) ద్వితీయస్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం నరేందర్, గణిత ఉపాధ్యాయులు జాడి శ్రీనివాస్ తెలిపారు.

ఉమ్మడి రిజర్వేషన్లు దామాషా ప్రకారం వర్గీకరించాలి



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ రమేశ్

ఎదులాపురం: 15 శాతం ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లను ఎస్సీ జనాభా దామాషా ప్రకారం వర్గీకరించాలని మాదిగ జాగృతి సమితి జిల్లా కన్వీనర్ రమేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎస్సీ జనాభాలో 70 శాతం ఉన్న మాదిగలకు 10 శాతం, 30 శాతంలోపు ఉన్న మాలలకు 4 శాతం, ఒక శాతం లోపు ఉన్న ఎస్సీ ఉప కులాలకు 1 శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు అడెల్లు, నగేశ్, గంగన్న, సాయికుమార్, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘కొందరికి కాదు.. అందరికి ఎమ్మెల్యేని’



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: నియోజకవర్గంలో కొందరికి కాదు, అందరికీ ఎమ్మెల్యేనని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్‌లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 73 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మంజూరు చేయడంలో మండల రెవెన్యూ అధికారులు ఏమాత్రం జాప్యం చేయవద్దన్నారు. దళారులను నమ్మవద్దని, ఏవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొందరు పార్టీని చూసి, మరికొందరు వ్యక్తులను చూసి ఓటేస్తారని, గెలిచిన తర్వాత సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు అందరి పనిచేయాల్సిందేనని తెలిపారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ సవాపురే విలాస్, డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, ఆర్‌ఐలు సాజిద్, అశోక్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని జామిడిలో కల్యాణ మండపం నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేలుగా పని చేసిన వారు గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకోకుండా పని చేయడంతో సమస్యలు పేరుకుపోయాయన్నారు. తన హయాంలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. ప్రతిపక్షంలో ఉన్న అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తనా.. ఇప్పటి వరకు హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. నిధులు మంజూరు చేయిస్తూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, నేరడిగొండ మాజీ ఎంపీపీ సజన్‌లాల్, ఇచ్చోడ మాజీ మార్కెట్ చైర్మన్ తిరుమల్‌గౌడ్, నర్వడే రమేశ్, పాండురంగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండలో గల శబరిమాత ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శాలువాతో సత్కరించి, ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు



జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

తాంసి: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ మండలస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విజేతలుగా నిలిచిన జట్లకు మండల ప్రత్యేకాధికారి వెంకట రమణ, ఎంపీడీవో మోహన్ రెడ్డి బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభ గుర్తించేందుకు సీఎం కప్ పోటీలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు జక్కుల శ్రీనివాస్, అశ్వత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం..

సిరికొండ: మండలంలో సీఎం కప్ క్రీడా పోటీలను మండలంలోని రాయిగూడ ఆశ్రమ పాఠశాలలో బుధవారం ప్రారంభించారు. పోటీలను ఎంపీడీవో రవీందర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరకంగా.. మానసికంగా ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆత్రం భాస్కర్, షేక్ ఇమామ్, మాధవ్ పటేల్, ఎంపీవో సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మోహన్‌బాబును అరెస్టు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు



ఎన్టీఆర్‌చౌక్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

కైలాస్‌నగర్: జర్నలిస్టులపై దాడికి పాల్పడిన సినీ నటుడు మోహన్‌బాబును తక్షణమే అరెస్ట్ చేయాలని జర్నలిస్టుల జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. న్యూస్ కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు దాడికి చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన మోహన్ బాబుతో పాటు అందులో ప్రమేయమున్న తన అనుచరులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులతో పాటు వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

బోథ్: సినీ నటుడు మోహన్‌బాబు ఇంట్లో జరుగుతున్న వివాదాలను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు చేసిన దాడిని బోథ్ ప్రెస్‌క్లబ్ తీవ్రంగా ఖండించింది. జర్నలిస్టులపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం బోథ్ తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సూది నరేశ్ మాట్లాడుతూ.. మోహన్‌బాబు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దాడి ఘటనను సుమోటోగా తీసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సీపీఎం అనుబంధ సంఘాల ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

కైలాస్‌నగర్: దేశంలో ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న కేరళ ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని, దానికి కాంగ్రెస్ పార్టీ కూడా సహకారం అందిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘువులు ఆరోపించారు. బుధవారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘువులు మాట్లాడుతూ దేశంలోనే అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పిస్తు రాజ్యాంగ పాలన కేరళలో సాగుతుందన్నారు. దీన్ని ఓర్వలేక కేంద్రంలోని బీజేపీ ఆ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు, అసత్య ప్రచారాలు చేస్తుందని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా పక్షపాతం చూపుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, రవీందర్, ఆశన్న, మంజుల, సురేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.